సమస్యలుంటే సాక్షికి చెప్పండి

మీ సమస్యలు, ప్రజోపయోగ సూచనలు, ఇతర అంశాలను కింద ఫోన్ నంబర్‌కు వాట్సాప్ చేయండి

78932 44734

నంబర్‌ను సంప్రదించండి

క్లుప్తంగా

ప్రచార యాత్రపై కరపత్రాలు పంపిణీ

సింధియా : కేంద్రంలోని నరేంద్రమోడీ ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలను వ్యతిరేకిస్తూ, విశాఖ స్టీల్‌ప్లాంట్‌తోపాటు ఇతర ప్రభుత్వరంగ సంస్థలను కాపాడుకోవాలనే నినాదంతో ఈ నెల 17 నుంచి సెప్టెంబర్ 8 వరకు నిర్వహిస్తున్న ప్రచార యాత్ర కరపత్రాలను సింధియా జంక్షన్‌లో మంగళవారం సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కాంధ్రేగుల సత్యాంజనేయ, గుడాల రాంబాబు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నరేంద్రమోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అనేక కార్మిక, ప్రజా, రైతు వ్యతిరేక విధానాలు అవలంభించారని ఆరోపించారు. ఈ యాత్రలో ప్రజలంతా భాగస్వాములు కావాలని కోరారు. సీపీఐ నాయకులు నూనెల సూరిబాబు, మధుసూదన్‌రావు, అప్పారావు, కనకరాజు పాల్గొన్నారు.

కిరణ్‌కుమార్ రెడ్డికి స్వాగతం


విశాఖ విమానాశ్రయంలో కిరణ్‌కుమార్ రెడ్డిని కలిసిన బీజేపీ నాయకులు

గోపాలపట్నం: నగరంలో పలు కార్యక్రమాల్లో పాల్గొనేందుకు విశాఖ విచ్చేసిన మాజీ ముఖ్యమంత్రి, బీజేపీ నాయకుడు కిరణ్‌కుమార్ రెడ్డికి ఆ పార్టీ నాయకులు విమానాశ్రయంలో సాదర స్వాగతం పలికారు. ఆయనతో పాటు టీజీ వెంకటేష్, సృజనా చౌదరి ఉన్నారు. వారికి బీజేపీ నాయకులు కాశీ రాజు, నాగేంద్ర, సురేంద్ర మోహన్, కేశవకాంత్, బాలరాజేశ్వరరావు తదితరులు స్వాగతం పలికారు.

27న గాజువాకలో చేనేత కులస్తుల బహిరంగ సభ

సీతంపేట: ఆల్ ఇండియా వీవర్స్ ఫెడరేషన్ విశాఖశాఖ ఆధ్వర్యంలో ఈ నెల 27వ తేదీన గాజువాక బీసీ రోడ్‌లోని టి.ఎస్.ఆర్.కల్యాణ మండపంలో చేనేత కులస్తుల బహిరంగ సభ జరగనుందని ఫెడరేషన్ జాతీయ అధ్యక్షుడు బండారు ఆనంద్ ప్రసాద్ అన్నారు. దీనికి సంబంధించిన పోస్టర్లు మంగళవారం శంకరమఠం రోడ్‌లోని పద్మశాలి భవనంలో ఫెడరేషన్ ప్రతినిధులతో కలిసి ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో సుమారు 40 లక్షల చేనేతలు ఉన్నా రాజకీయంగా తగిన గుర్తింపు లభించడం లేదన్నారు. చేనేతల ఉనికిని చాటుకోవడంతో పాటు, సమస్యల పరిష్కారం కోసం 27వ తేదీన గాజువాకలో జరగనున్న చేనేతల బహిరంగ సభకు నేతన్నలంతా తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి సమతం రమణ మహేష్, రాష్ట్ర అధ్యక్షుడు ఎనమల శివ రాంప్రసాద్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పప్పు రాజారావు, ఏపీ పద్మశాలి సంఘం పెద్దల కమిటీ చైర్మన్ తెడ్లాపు వెంకటేశ్వర్లు, ఫెడరేషన్ ఉపాధ్యక్షుడు పిల్లలమర్రి నాగేశ్వరరావు, జిల్లా నాయకులు మాడెం సూరిఅప్పారావు, కొప్పుల రామ్‌కుమార్, గుదే వేణు, పద్మశాలి భవనం అధ్యక్షుడు కులపాక సన్యాసిరావు, మాజీ కార్పొరేటర్ ఆలేటి హేమలత పాల్గొన్నారు.

కార్మిక వర్గాన్ని దెబ్బకొట్టే యత్నమే ప్రైవేటీకరణ


దీక్షలో పాల్గొన్న పోరాట కమిటీ నాయకులు

కూర్మన్నపాలెం: కేంద్ర ప్రభుత్వం కార్మిక వర్గాన్ని దెబ్బ కొట్టాలనే ఆలోచనతోనే ప్రైవేటీకరణ అంశాన్ని తెరమీదకు తెచ్చిందని ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు విమర్శించారు. ఉక్కు ఉత్పత్తిని నిలిపివేసి, ప్లాంట్‌ను నిర్వీర్యం చేయడమే కాక సంస్థను ప్రైవేట్ వ్యక్తులకు అప్పజెప్పాలని కుట్రలు పన్నుతున్నారని ఆరోపించారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలోని ప్లాంట్ ఆర్చి వద్ద చేపట్టిన దీక్షల్లో 922వ రోజు మంగళవారం సంస్థకు చెందిన పలు విభాగాల కార్మికులు, పోరాట కమిటీ నాయకులు పాల్గొన్నారు.

సాక్షి

మీరు సాక్షి చందాదారులుగా చేరదలుచుకున్నారా!
లేదా మీకు పేపరు అందటంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయా!
సంప్రదించవలసిన నెంబరు
వైజాగ్ వెస్ట్
8978872250

మాతా శిశు సంరక్షణే లక్ష్యంగా..


పిల్లలకు ఆటపాటలు నేర్పుతున్న టీచర్


గణేష్ నగర్ అంగన్‌వాడీ కేంద్రంలో బాలింతలు, గర్భిణులకు సరకులు పంపిణీ చేస్తున్న టీచర్

- 'వైఎస్సార్ సంపూర్ణ పోషణ' అమలు
- గర్భిణులు, బాలింతలకు ఇంటికే రేషన్
- అంగన్‌వాడీల ద్వారా పౌష్టికాహారం పంపిణీ
- ఎఫ్‌ఆర్‌ఎస్ యాప్‌లో సమగ్ర వివరాల నమోదు

విశాఖ విద్య: మాతా శిశు సంరక్షణే లక్ష్యంగా అమలు చేస్తున్న వైఎస్సార్ సంపూర్ణ పోషణ పథకం సత్ఫలితాలు ఇస్తోంది. గర్భిణులు, బాలింతల్లో పోషకాహార లోపం, రక్తహీనత నివారించేందుకు అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పౌష్టికాహారం ఇంటికే సరఫరా చేస్తుండటంతో లబ్ధిదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. రోజూ మధ్యాహ్నం ఎండలో వెళ్లే శ్రమ లేకుండా రేషన్ సరకులు ఇంటికే ఇవ్వడంతో వాటిని తీసుకునేందుకు గర్భిణులు, బాలింతలు ఆసక్తి చూపుతున్నారు. కేంద్రాల్లో 3 నుంచి 6 సంవత్సరాల మధ్య వయసు గల పిల్లల కోసం ప్రీ స్కూల్ నిర్వహిస్తుండటంతో చిన్నారులకు ఆటపాటలతో విద్య అందుతోంది. కేంద్రాలను మరింత సమర్థవంతంగా నిర్వహించేలా ఐసీడీఎస్ అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు.

ఇంటికే బలవర్థకమైన ఆహారం

'వైఎస్సార్ సంపూర్ణ పోషణ' పథకం ద్వారా వివిధ రకాల ఆహార వస్తువులను పంపిణీ చేస్తున్నారు. నెలలో రెండు సార్లు సరకులను అందజేస్తున్నారు. ఫేజ్ వన్‌లో భాగంగా ప్రతీ ఒక్కరికీ మూడు కేజీల బియ్యం, కేజీ కందిపప్పు, అరకేజీ మంచి నూనె, రెండున్నర లీటర్ల పాలు, 13 గుడ్లు, 2 కేజీల రాగిపిండి, 1 కేజీ అటుకులు, 250 గ్రాముల బెల్లం, 250 గ్రాముల వేరుశనగ చిక్కీ, 250 గ్రాముల ఎండు ఖర్జూరం అందిస్తున్నారు. అదే విధంగా రెండో ఫేజ్‌లో రెండున్నర లీటర్ల పాలు, 12 గుడ్లు పంపిణీ చేస్తున్నారు.

ఎఫ్‌ఆర్‌ఎస్‌తో అక్రమాలకు చెక్

టీడీపీ ప్రభుత్వ హయాంలో అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పంపిణీ చేసే సరకుల్లో పలు అక్రమాలు చోటుచేసుకునేవి. కొంతమంది టీడీపీ నాయకుల ఒత్తిళ్లతో సరకులు పక్కదారి పట్టేవి. ఇలాంటి వాటికి పూర్తి స్థాయిలో అడ్డుకట్ట వేసేలా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. సరకుల పంపిణీలో పారదర్శకతకు పెద్ద పీట వేయాలని ఆదేశించింది. ఎఫ్‌ఆర్‌ఎస్ యాప్‌లో లబ్ధిదారుల ఫొటోతో కూడిన వివరాలను నమోదు చేస్తేనే సరకులు ఇస్తున్నారు. సరకులు ఎక్కడ పంపిణీ చేశారనే లొకేషన్ కూడా నమోదవుతోంది.

పిలిచి సరకులు ఇస్తున్నారు



నాకు ఇద్దరు పిల్లలు. గర్భిణిగా ఉన్నప్పుడు గోపాలపట్నంలోని కేంద్రం ద్వారా రేషన్, ఇతర పౌష్టికాహార సరుకులు తీసుకున్నాను. కాన్పు కోసం పుట్టింటికి వచ్చాను. ఎనిమిదో నెల గర్భవతిగా ఉన్నప్పటి నుంచి గణేష్ నగర్ కేంద్రంలో సరకులు ఇస్తున్నారు. రెండో కాన్పులో బాబుకు మూడో నెల. ప్రతీ నెలా పిలిచి మరీ సరకులు ఇస్తున్నారు. గతంలో ఇలా ఉండేది కాదు. అంగన్‌వాడీ కేంద్రం ద్వారా ఇస్తున్న సరకులు మాలాంటి వారికి ఎంతో ఉపయోగపడుతున్నాయి. ఇంటికి సరకులు ఇవ్వడం వల్ల మాకు నచ్చినట్లు వండుకునే వీలు ఉంటోంది.

– కె. కనకరత్నం, బాలింత, గౌరీ నగర్

లబ్ధిదారులకు సకాలంలో పంపిణీ



మా కేంద్రంలో 30 మంది గర్భిణులు, 20 మంది బాలింతలు, ఏడు నెలల నుంచి మూడేళ్ల లోపు వయసు గల వారు 79మంది ఉన్నారు. ప్రీ స్కూల్‌కు 15 మంది పిల్లలు వస్తున్నారు. కేంద్రంలో నమోదైన గర్భిణులు, బాలింతలందరికీ సకాలంలో సరకులు పంపిణీ చేస్తున్నాం. ప్రీ స్కూల్ పిల్లలకు కేంద్రంలోనే భోజనం వండి పెట్టి, ఆటపాటలతో విద్యాబోధన అందిస్తున్నాం. ఉన్నతాధికారుల సూచనలకు అనుగుణంగా సేవలు అందిస్తున్నాం.

– జె.మార్త, అంగన్‌వాడీ టీచర్, గణేష్‌నగర్

కేంద్రాలపై పర్యవేక్షణ పెంపు



అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా మెరుగైన సేవలు అందేలా పర్యవేక్షిస్తున్నాం. కేంద్రాలకు సకాలంలో వైఎస్సార్ సంపూర్ణ పోషణ పథకం సరకులు సరఫరా అయ్యేలా చూస్తున్నాం. గర్భిణులు, బాలింతల ఆరోగ్య పరిరక్షణపై అవగాహన కల్పిస్తుండటంతో పాటు, ప్రీ స్కూల్ నిర్వహణ సవ్యంగా సాగేలా కేంద్రాల నిర్వాహకులను అప్రమత్తం చేస్తున్నాం.

– జె.టి.ఎస్. జ్యోతి, సూపర్‌వైజర్, మర్రిపాలెం సెక్టార్

కాలనీలను సుందరంగా తీర్చిదిద్దుతాం

డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్


వివరాలు తెలుసుకుంటున్న డిప్యూటీ మేయర్ శ్రీధర్

విశాఖ విద్య: మహా విశాఖ నగరపాలక సంస్థ పరిధిలోని కాలనీలను సుందరంగా తీర్చిదిద్దుతామని డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ అన్నారు. విశాఖ పశ్చిమ నియోజకవర్గ పరిధి 52వ వార్డులోని పలు కాలనీల్లో అధికారులు, సచివాలయ సిబ్బందితో కలిసి మంగళవారం ఆయన పర్యటించారు. వుడాలే అవుట్ వినాయకుడి ఆలయం పక్కన జరుగుతున్న రహదారి మరమ్మతులను పరిశీలించారు. వాహనదారులకు అసౌకర్యం కలగకుండా పనులు వేగవంతం చేయాలని అధికారులకు సూచించారు. అనంతరం రైతు బజార్ పక్కన గ్రీన్ బెల్ట్‌ను పరిశీలించారు. గ్రీన్ బెల్ట్‌లో పరిశుభ్రత, వాకింగ్ ట్రాక్, గ్రీన్ బెల్ట్ పార్క్ నిర్వహణ వంటి అంశాలపై కమిటీ సభ్యులతో చర్చించారు. ఈ సందర్భంగా డిప్యూటీ మేయర్ శ్రీధర్ మాట్లాడుతూ వార్డు పరిధిలో గల కాలనీలను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు చెప్పారు. పారిశుధ్య నిర్వహణ బాగుంటేనే అనుకున్న లక్ష్యాన్ని సాధించవచ్చన్నారు. ఈ విషయంలో కాలనీ వాసుల సహకారం అవసరమన్నారు. అందరి సహకారంతో వార్డు పరిధిలో మరిన్ని అభివృద్ధి పనులు చేపట్టేందుకు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో వార్డు పారిశుధ్య అధికారి సురేష్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

మంచినీటి బావుల్లో గంబూసియా చేపల విడుదల


బావిలో గంబూసియా చేపలను విడుదల చేస్తున్న కార్పొరేటర్ చిన్నా


నేల బావిలో చేపలు వేస్తున్న కార్పొరేటర్ సుధ

సింధియా: జీవీఎంసీ 63వ వార్డు పరిధిలోని మంచి నీటి బావుల్లో గంబూసియా చేపలను కార్పొరేటర్ గల్లా చిన్నా, మలేరియా నివారణ అధికారులు మంగళవారం విడుదల చేశారు. డెంగ్యూ, మలేరియా కారక దోమల వ్యాప్తిని అరికట్టేందుకు ఈ చర్యలు చేపట్టామని అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా చిన్నా మాట్లాడుతూ సీజనల్ వ్యాధులైన డెంగ్యూ, మలేరియా, చికున్‌గున్యా వంటి వ్యాధుల నివారణకు తీసుకోవలసిన జాగ్రత్తలను వివరించారు. ప్రతీ మంగళ, శుక్రవారాల్లో డ్రైడే పాటించాలని కోరారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు అమెరికా శ్రీను, పుక్కల కృష్ణ, ధర్మ, పుక్కల రాజారావు, మలేరియా సిబ్బంది, జీవీఎంసీ సిబ్బంది, సచివాలయ సిబ్బంది, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

డ్రై డే తప్పక పాటించాలి

మల్కాపురం : జీవీఎంసీ 61వ వార్డు పరిధి పలు ప్రాంతాల్లోని నేల బావుల్లో గంబూసియా చేపలను వేశారు. మల్కాపురం, గొల్లవీధి, మూడు నూతల ఏరియాలో కార్పొరేటర్ కొణతాల సుధ మంగళవారం ఈ చేపలను వేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ నేల బావుల్లో నీటిపై లార్వా పెరగకుండా తొలి దశలోనే గంబూసియా చేపలు చంపేస్తాయన్నారు. ఇంట్లో, పరిసరాల్లో నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలని సూచించారు. ప్రతి శుక్రవారం తప్పనిసరిగా డ్రై డే పాటించాలన్నారు. కార్యక్రమంలో వార్డు శానిటరీ అధికారి రవితోపాటు మలేరియా విభాగ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

సింహగిరిపై ఘనంగా నృసింహ హోమం


ప్రధాన కలశంతో తిరువీధి నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: స్వాతి నక్షత్రం పురస్కరించుకుని సింహగిరిపై మంగళవారం శ్రీ నృసింహ హోమం ఘనంగా జరిగింది. లోక కల్యాణార్థం వరాహ లక్ష్మీ నృసింహస్వామి జన్మ నక్షత్రమైన ప్రతీ స్వాతి నక్షత్రం రోజున సింహగిరిపై నృసింహ హోమం నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. ఉదయం7గంటల నుంచి ఆలయ ప్రాంగణంలోని కల్యాణ మండపంలో నృసింహ హోమం నిర్వహించారు. తొలుత చక్రపెరుమాళ్లను వేద మంత్రోచ్చరణలు, మంగళవాయిద్యాల మధ్య ఊరేగింపుగా కల్యాణ మండపానికి తీసుకొచ్చి అక్కడ ఉన్న హోమగుండం వద్ద అధిష్టంపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, కలశారాధన, అగ్నికార్యం చేశారు. అనంతరం నృసింహ హోమం విశేషంగా నిర్వహించారు. అనంతరం పూర్ణాహుతి, కుంభప్రోక్షణ చేశారు. హోమంలో ఉంచిన ప్రధాన కలశాన్ని అర్చకుడు శ్రీకాంతాచార్యులు తలపై పెట్టుకుని తిరువీధిగా ఆలయంలోకి తీసుకెళ్లి స్వామివారి మూలవిరాట్‌కు సమర్పించారు. తదుపరి ఆ జలాలను భక్తులపై చల్లారు. దేవస్థానం తరపున ఉభయాతలకు స్వామివారి శేషవస్త్రాలు, ప్రసాదం అందజేశారు. దేవస్థానం అర్చకుడు పవన్‌కుమార్, వేదపండితులు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఏఈవో భ్రమరాంబ, సూపరింటెండెంట్ సునీల్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

సామాజిక భవన నిర్మాణ పనులు పరిశీలన


పనులు పరిశీలిస్తున్న అధికారులు, నాయకులు

మల్కాపురం: జీఈఎంసీ 58వ వార్డు ఉప్పరకాలనీలో జీవీఎంసీ నిధులతో నిర్మిస్తున్న సామాజిక భవనం పనులను వర్క్స్ ఏఈ ఉషారాణి, కనకరాజు మంగళవారం పరిశీలించారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఈ ప్రాంతంలో వైఎస్సార్‌సీపీ పశ్చిమ సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్, వార్డు కార్పొరేటర్ గులిగిందల లావణ్య పర్యటించినప్పుడు స్థానికులు తమ ప్రాంతంలో సామాజిక భవనం ఏర్పాటు చేయాలని కోరారు. దీనిపై స్పందించిన ఆడారి ఆనంద్‌కుమార్ అధికారులతో మాట్లాడి ఇక్కడ సామాజికభవనం ఏర్పాటుకు చర్యలు తీసుకున్నారు. దీనిలో భాగంగా ఆ పనులను వర్క్స్ ఏఈలతో పాటు పార్టీ వార్డు అధ్యక్షుడు గులిగిందల కృష్ణ పనులు పరిశీలించారు. పనుల్లో నాణ్యత పాటించాలని సూచించారు.

అప్పన్నకు విశేషంగా నిత్య కల్యాణం


జీలకర్రబెల్లం ఘట్టం నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి మంగళవారం నిత్యకల్యాణం విశేషంగా జరిగింది. ఉదయం 9.30 గంటల నుంచి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆలయ కల్యాణమండపంలో వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి,భూదేవిలను అధిష్టంపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, సంకల్పం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి ప్రసాదం, శేషవస్త్రాలు అందజేశారు.

విశాఖ చేరుకున్న సుబ్బారెడ్డి


విమానాశ్రయం నుంచి కార్యకర్తలు, నాయకులతో వస్తున్న వైవీ సుబ్బారెడ్డి

గోపాలపట్నం: విశాఖ చేరుకున్న వైఎస్సార్‌సీపీ రీజినల్ కో–ఆర్డినేటర్ వై.వి.సుబ్బారెడ్డికి విమానాశ్రయంలో ఘన స్వాగతం లభించింది. పార్టీ శ్రేణులు అధిక సంఖ్యలో వచ్చి ఆయనను పుష్పగుచ్ఛాలు, శాలువాలతో ముంచెత్తారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ అభ్యర్థులను ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ప్రకటిస్తారని తెలిపారు. ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ, పెందుర్తి ఎమ్మెల్యే అదీప్‌రాజ్, కోలా గురువులు, కేకే రాజు, మాజీ ఎమ్మెల్యే చింతలపూడి వెంకటరామయ్య, పేడాడ రమణ కుమారి, బెహరా భాస్కర రావు, శ్యామ్‌కుమార్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

డెబ్రిస్ తొలగింపు

సాక్షి ఎఫెక్ట్..


జీవీఎంసీ సిబ్బంది వ్యర్థాలు తొలగించిన తర్వాత రోడ్డు

గోపాలపట్నం: కొత్తపాలెంలో నరవ వెళ్లే రహదారిలో జీవీఎంసీ అధికారులు డెబ్రిస్ తొలగించారు. 'డంపింగ్ యార్డులా కొత్తపాలెం' శీర్షికతో ఈ నెల 20న సాక్షిలో ప్రచురితమైన వార్తకు అధికారులు స్పందించి సిబ్బందితో డెబ్రిస్‌ను కొంతమేర తొలగించారు. ఇంకా కల్వర్టు వద్ద తొలగించాల్సి ఉంది. ఇటీవల గోపాలపట్నంలో దగ్ధమైన వస్త్ర దుకాణంలోని వ్యర్థాలు ఇక్కడే వేసేశారని స్థానికులు ఆరోపిస్తున్నారు. జీవీఎంసీ శానిటరీ విభాగం అధికారులకు భారీగా ముట్టజెప్పినట్లుగా విమర్శలు వినిపిస్తున్నాయి. ఇక్కడి సూపర్‌వైజర్లు అభ్యంతరం చెప్పినా పట్టించుకోలేదని స్థానికులు చెబుతున్నారు.

ఆలయాలకు శ్రావణ శోభ




బంగారమ్మ తల్లికి పూజలు చేస్తున్న అర్చకులు, లలిత సహస్రనామ పారాయణ చేస్తున్న భక్తులు

భక్తిశ్రద్ధలతో మంగళగౌరీ వ్రతం

విశాఖ విద్య: శ్రావణ మాసం.. తొలి మంగళవారం .. అమ్మవారి ఆలయాలు ఆధ్యాత్మిక శోభను సంతరించుకున్నాయి. అధిక సంఖ్యలో మహిళలు మంగళగౌరీ వ్రతం ఆచరించి, అమ్మవారిని దర్శించుకున్నారు. ఎన్‌ఏడీ కూడలి 90వ వార్డు బుచ్చిరాజుపాలెంలో కొలువుదీరిన శ్రీ దుర్గాలమ్మ, శ్రీ బంగారమ్మ ఆలయంలో సామూహిక కుంకుమార్చనకు మహిళలు తరలివచ్చారు. మంగళగౌరీ వ్రతంలో పాల్గొని, సామూహిక లలితా సహస్ర నామ పారాయణం చేశారు. ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లు పర్యవేక్షించారు. భక్తులకు అన్నప్రసాదం అందించారు. గ్రామ అభ్యుదయ సేవా సంఘం అధ్యక్షుడు పురెడ్డి గురు రామరెడ్డి, కార్యదర్శి దొడ్డి జగదీశ్వరరావు, కోశాధికారి మొల్లి కుమార్ రాజు, కమిటీ సభ్యులు దొడ్డి సతీష్, గోపి, కిషోర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. కొత్తరోడ్ సమీపంలోని వల్లీ దేవసేన సహిత సుబ్రహ్మణ్యస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు.

రైతుబజార్‌లో రూ.38కే కిలో టమాటా


రైతుబజార్‌లో టమాటాలు కొనుగోలు చేస్తున్న వినియోగదారులు

విశాఖ విద్య: జీవీఎంసీ 52వ వార్డు పరిధి ఎన్‌ఏడీ కూడలి సమీపంలో ఏర్పాటు చేసిన రైతు బజార్‌లో వినియోగదారుల అవసరాల మేరకు టమాటా విక్రయాలు జరుపుతున్నారు. నిన్నమొన్నటి వరకు రూ.150 వరకు పలికిన కిలో టమాటాల ధర ఒక్కసారిగా తగ్గింది. బ్లాక్ మార్కెట్‌ను నియంత్రిస్తూ వినియోగదారులకు మేలు చేసేలా ప్రభుత్వం ఎప్పటికప్పుడు తీసుకుంటున్న చర్యలతో ధర తగ్గింది. మంగళవారం కిలో టమాటా (పెద్ద సైజు) రూ.38లకు విక్రయించారు. విక్రయాల కోసం ప్రత్యేకంగా రెండు కౌంటర్లు ఏర్పాటు చేశామని రైతు బజార్ ఎస్టేట్ అధికారి కొమ్మనాపల్లి వరహాలు తెలిపారు. అదేవిధంగా ఉల్లిపాయలు రూ.25లకు విక్రయిస్తున్నట్లు చెప్పారు. ధరల అదుపునకు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలపై వినియోగదారులు సంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

సేవా మార్గంలో భారీ వాహనాలు నిలిపితే చర్యలు

ట్రాఫిక్ ఏసీపీ రాజీవ్‌కుమార్


స్టేషన్‌లో రికార్డులు పరిశీలిస్తున్న ఏసీపీ రాజీవ్‌కుమార్

మల్కాపురం : మల్కాపురం ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌ను ట్రాఫిక్ ఏసీపీ రాజీవ్‌కుమార్ మంగళవారం ఉదయం సందర్శించారు. ముందుగా ఆయన స్టేషన్ పరిధిలోని ట్రాఫిక్ సిబ్బంది, వివిధ కేసులకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. అనంతరం ముఖ్య కూడళ్లలో ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సిబ్బందికి సూచనలు చేశారు. నేవల్ ఏరియాలో, స్కూల్ జోన్ పరిధిలో, ట్రాఫిక్ ఎక్కువగా ఉండే ప్రదేశాల్లో భారీ వాహనాలు నిలపకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అలాంటి ప్రదేశాల్లో నో పార్కింగ్ బోర్డులు అమర్చాలని సూచించారు. అయినప్పటికీ నిబంధనలు ఉల్లంఘించి ఎవరైనా భారీ వాహనాలు నిలిపితే కఠిన చర్యలు తీసుకోవాలని, జరిమానాలు విధించాలని ఆదేశించారు. కార్యక్రమంలో ట్రాఫిక్ సీఐ తులసీదాస్, ఎస్ఐ సుదర్శన్‌రావు సిబ్బంది పాల్గొన్నారు.

'మీతో మీ ఆనంద్' యాప్ పై అవగాహన


యాప్‌పై మహిళలకు అవగాహన కల్పిస్తున్న బాబూరావు

మల్కాపురం: మీతో మీ ఆనంద్ యాప్‌ను పశ్చిమ నియోజకవర్గ పరిధిలోని ప్రతి ఒక్కరూ తప్పక డౌన్‌లోడ్ చేసుకోవాలని వైఎస్సార్‌సీపీ నాయకుడు స్పందన బాబూరావు కోరారు. 60వ వార్డు గుల్లలపాలెం ఉడా కాలనీ వద్ద స్థానిక మహిళలతో మంగళవారం సాయంత్రం ఆయన సమావేశమయ్యారు. యాప్‌ను ఎలా డౌన్‌లోడ్ చేయాలో తెలియజేశారు. యాప్‌లో నిరుద్యోగులు తమ విద్యార్హత, సాంకేతిక అనుభవం వివరిస్తే అందుకు అనుగుణంగా ఉపాధి కల్పించే చర్యలు చేపడతామని తెలిపారు. స్థానిక ప్రజా సమస్యలను యాప్ ద్వారా తెలియజేస్తే పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్త ఆనంద్‌కుమార్ స్పందించి, త్వరితగతిన పరిష్కరించేలా చర్యలు చేపడతారన్నారు. ఇప్పటి వరకు నియోజకవర్గ పరిధిలో సుమారు 16 వేల మంది ఈ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకున్నారని వివరించారు.

గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులకు అభినందన


కార్పొరేటర్‌ను కలిసిన కమిటీ సభ్యులు

సింధియా: జీవీఎంసీ 62వ వార్డు గుడివాడ అప్పన్న కాలనీ గ్రామానికి ఏకగ్రీవంగా ఎన్నికైన నూతన గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులను కార్పొరేటర్, జీవీఎంసీ స్టాండింగ్ కమిటీ సభ్యుడు బల్ల లక్ష్మణరావు అభినందించారు. అంబేడ్కర్ కాలనీలోని పార్టీ కార్యాలయంలో కార్పొరేటర్‌ను మంగళవారం మర్యాదపూర్వకంగా కలిసిన కమిటీ సభ్యులు కాలనీలోని పలు అంశాలపై చర్చించారు. కార్యక్రమంలో సంఘం గౌరవాధ్యక్షుడు ఎం.ఎల్.నాయుడు, అడ్వైజర్ తవిటయ్య, అధ్యక్షుడు కె.కృష్ణ, కార్యదర్శి వై.రవి, ఇతర కార్యవర్గ సభ్యులు టి.ప్రసాద్, బి.చిన్నంనాయుడు, పి.భాస్కరరావు, ఎ.జోగినాయుడు, పిల్లి శంకరరావు, గంజి శ్రీను, ఎం కృష్ణ, జె.ధర్మ పాల్గొన్నారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.

వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు

వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు

శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు

అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.

వైజాగ్ వెస్ట్
9912222753, 9705933394
Office mail : sakshiadvtvsp@gmail.com